క్లుప్తంగా

హెచ్చరిక ఫ్లెక్సీల ఏర్పాటు



కూళ్లలో ఏర్పాటు చేసిన హెచ్చరిక ఫ్లెక్సీ

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గోదావరి వద్ద మంగళవారం పంచాయతీ సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కూళ్ల పరిధిలో ప్రమాదకరంగా ఉన్న మూడు చోట్ల హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవి కావడంతో గోదావరిలో స్నానానికి దిగే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న చోట్ల దిగితే ప్రాణాలు పోతాయని హెచ్చరించారు. యువత కూడా గోదావరిలో స్నానానికి దిగే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ముద్రగడ చంటి, వీఆర్‌ఓ పట్టాభి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు బుధవారం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చ ఉంటుందని కమిషనర్ తెలిపారు.

రేపు ఉచిత యోగా శిక్షణ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో శుక్రవారం ఉచిత యోగా శిక్షణ నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు బుధవారం తెలిపారు. స్థానిక బాబు అండ్ బాబు ఫంక్షన్ హాల్‌లో విజయవాడలోని సత్యసాయి ధ్యాన మండలి యోగా గురువు రఘు శిక్షణ ఇస్తారన్నారు. పట్టణ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సినిమా థియేటర్ల తనిఖీ



రాజగోపాల్ థియేటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్డీవో డి.అఖిల పట్టణంలోని సినిమా థియేటర్లను బుధవారం తనిఖీలు చేశారు. రాజగోపాల్ థియేటర్‌ను తనిఖీ చేసి థియేటర్లో ప్రేక్షకులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. శానిటేషన్, టిక్కెట్ల రేట్లు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు థియేటర్లలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని థియేటర్ యాజమాన్యానికి సూచించారు. అలాగే శ్రీలక్ష్మి, సూర్య మ్యాక్స్ థియేటర్లను తహసీల్దార్ మృత్యుంజయరావు తనిఖీ చేశారు.

'వాలిన' వర్ధంతి



మండపేటలో సూర్యభాస్కరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని ఆదర్శ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థలో బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన మాజీ అధ్యక్షుడు వాలిన సూర్యభాస్కరరావు నాలుగో వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నిర్వాహకుడు వాలిన వీరబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా నాగేశ్వరరావు, సత్తిబాబు ఎం.గణేష్, టి.సూరిబాబు, మహేష్, ఎస్.రాజు, కుమార్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ వీర్రాజు మృతి



కె.వీర్రాజు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో మొదటి తరం ఫొటోగ్రాఫర్ కె.వీర్రాజు (పద్మా స్టూడియో వీర్రాజు) (82) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. 1971లో ఆయన ద్రాక్షారామలో స్టూడియో ఏర్పాటు చేశారు. 50కి పైగా గ్రామాలకు నడిబొడ్డుగా ఉన్న ద్రాక్షారామలో అప్పట్లో క్యూలో నిల్చుని మరీ ఫొటోలు తీయించుకునేవారని ఆయన స్నేహితులు చెప్పారు. ఆయన నేత్రాలను కాకినాడకు చెందిన రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు ఆయన కుమారులు వీరవెంకట సత్యనారాయణ(బాబీ), సూర్యశంకరనారాయణ(బుజ్జి), కుమార్తె పద్మలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్, మాజీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, నియోజవర్గ శెట్టిబలిజ సంఘ పెద్దలు కట్టా సూర్యానారాయణ, నరాల ఏడుకొండలు, వి.లక్ష్మీనారాయణ, రామచంద్రపురం ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పాడిలో విజయం సాధించాలంటే..

- 60 రోజులకు చూడి పరీక్ష తప్పనిసరి
- 3 నుంచి 6 నెలల మధ్యలో నట్టల నివారణ మందు
- ఇబ్బందులు ఎదురైతే వైద్యుల సహకారం



గేదెకు చూడి పరీక్ష చేస్తున్న వైద్యురాలు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: పాడి పరిశ్రమలో విజయం సాధించాలంటే చక్కటి యాజమాన్య పద్ధతులు పాటించాలని రామచంద్రపురం మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున సూచిస్తున్నారు. కృత్రిమ గర్భధారణ చేసిన 60 రోజులకు తప్పనిసరిగా చూడి పరీక్ష చేయించాలని, కట్టుకు రానంత మాత్రాన పశువు చూడిదని పరీక్ష చేయించడంపై నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు. చూడి పరీక్ష, చూడి పశువుల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

చూడి పశువుల విషయంలో జాగ్రత్తలు

చూడి పశువులను ఎక్కువ దూరం నడిపించకూడదు, పరిగెత్తించకూడదు. ఎత్తు ప్రదేశాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. 3 నుంచి 6 నెలల్లో నట్టల నివారణ మందులు తాగించాలి. చూడి పశువు పొదుగును ఈనడానికి నెల ముందు నుంచి మర్దన చేయాలి. దీని వల్ల పొదుగు బాగా పెరుగుతుంది. ఈనడానికి 45–60 రోజుల ముందు పాలు పితకకుండా వదిలేయాలి. ఇలా చేయడం వల్ల పొదుగులోని పూర్వ కణజాలం నశించి, కొత్త కణజాలం ఏర్పడుతుంది. ఈనిన తర్వాత పాల ఉత్పత్తి పెరుగుతుంది. పశువు నిండు చూలుతో ఉన్నప్పుడు మేతకు బయటకు వదలకూడదు. చూడితో ఉన్న పశువులను ఎదలో ఉన్న ఇతర పశువులు, ఆబోతుగాని ఎక్కకుండా చూడాలి. చూడి పశువులను ఇతర పశువులతో కలపకుండా విడిగా లేక వేరే పాకలో ఉంచాలి. అక్కడ నేల జారుడుగా లేకుండా చూసుకోవాలి. బయటకు వదిలేటప్పుడు ఇరుకైన మార్గాలు లేకుండా చూడాలి.

చూడి పశువుల మేపు

చూడి పశువులకు సమృద్ధిగా పచ్చి మేత వేయాలి. చూడి దశలో పశువుకు దాని శరీర పోషణతో పాటు గర్భంలోని పిండం అభివృద్ధికి కూడా పోషక పదార్థాలు అవసరం. ఈ దశలో అదనంగా మేత, దాణా ఇవ్వాల్సి ఉంటుంది. చివరి రెండు మాసాల చూడిలో పశువుకు కిలో దాణా, 30 గ్రాముల ఖనిజ లవణ మిశ్రమం అదనంగా ఇవ్వాలి.

ఈనబోయే పశువు లక్షణాలు

నెలలు నిండిన పశువు చిన్నగా నడుస్తుంది. పొదుగు బాగా పెరుగుతుంది. తొలిచూలు పశువులో పొదుగు 4 నెలల నుంచి పెరగడం ప్రారంభమవుతుంది. ఈతల పశువులో ఈనడానికి రెండు వారాల ముందు మాత్రమే పొదుగు పెరుగుతుంది. తొలిచూలు పశువులో 4వ నెల నుంచే చన్నుల నుంచి పిండినప్పుడు జిగురుగా తీగ వంటి ద్రవం గమనించవచ్చు. పశువు ఈనే ముందర పసుపు పచ్చని ముర్రుపాలుగా మారుతుంది. పశువు ఈనడానికి కొద్ది రోజుల ముందర నీరుడు పెరుగుతుంది. ఇతర పశువులతో కలవక ప్రశాంతమైన ప్రదేశాన్ని కోరుకుంటుంది. మేత తీసుకోవడం మందగిస్తుంది. శరీర ఉష్ణోగ్రత 1 నుంచి 2 డిగ్రీల ఫారన్‌హీట్ పెరుగుతుంది. హార్మోన్ల ప్రభావం వల్ల గర్భ ద్వారం మెత్తబడి తెరుచుకొనుట మొదలవుతుంది.



డా.మేడిశెట్టి కృష్ణార్జున, పశు వైద్యాధికారి, రామచంద్రపురం మండలం

పశువు ఈనే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నెలలు నిండిన పశువు సరిగ్గా ఏ రోజు ఏ సమయంలో ఈనుతుందో ముందుగా చెప్పలేము. కాని సాధారణంగా పశువులు రాత్రివేళ లేదా తెల్లవారు జామున ఈనడం గమనించవచ్చు. బహుశా ఆ సమయంలో ప్రశాంతంగా తక్కువ అలజడి, ఒత్తిడి ఉండటం వల్ల కావచ్చు. ఈనే లక్షణాలు కన్పించిన వెంటనే పశువును వేరే పాకలో శుభ్రమైన పాడిగడ్డితో పక్కవేసి ఉంచాలి. రాత్రి వేళలో తరచూ గమనిస్తుండాలి. సాధారణంగా పశువులు ఎలాంటి సాయం లేకుండా ఈనతాయి. కానీ కనిపెట్టుకుని ఉండటం వల్ల ఒక్కోసారి దూడ అడ్డం పడినప్పుడు లేక వెనుక కాళ్లు వచ్చినప్పుడు వెంటనే పశు వైద్యుల సహాయం తీసుకుని దూడకు, తల్లికి ప్రాణాపాయం లేకుండా చూడగలుగుతాము. ఈతల పశువుకు నొప్పులు మొదలైన 2 గంటల్లోగా ఈనుతుంది. అదే తొలిచూలు బిడ్డ అయితే ఎక్కువ సమయం పడుతుంది. ఈనలేకపోతే డాక్టర్‌ను సంప్రదించాలి. అంతేగానీ దూడను లాగటానికి ప్రయత్నించకూడదు. ముందర కాళ్లు, తల బయటకు వస్తే ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఈనిన వెంటనే దూడకు తల్లి దగ్గర జున్ను పాలు తాగించాలి. దీనివల్ల ఆక్సిటోసిన్ హార్మోన్ ఉత్పత్తి అయి మాయ సకాలంలో వేస్తుంది. ఈనిన 24 గంటల్లోగా మాయ వేయకుంటే పశువైద్యుల సహాయం తీసుకోవాలి. ఈనిన తర్వాత మంచి పాడిసార కలిగిన పశువులకు పాలజ్వరం రాకుండా కాల్సియం ఇంజక్షన్లు ఇప్పించాలి.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

కపిలేశ్వరపురం: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా అంగరలో పుత్సల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేశారు. పలు ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, రొట్టెలను అందజేశారు. అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, తాతపూడి, మాచర, టేకి, నేలటూరు, వెదురుమూడి, నల్లూరు, కాలేరు, అచ్యుతాపురం గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: కాజులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ వీర్రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ సబ్‌స్టేషన్, మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాజులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, శీల, శీలలంక, ఒంటితాడి విద్యుత్‌లైన్లలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహావసర వినియోగదారులతో పాటు, ఆక్వా, ఇండస్ట్రియల్ ఫీడర్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందని ప్రజలు సహకరించాలన్నారు.

శారీరక మార్పులపై శాస్త్రీయ అవగాహన అవసరం



మాచరలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

కపిలేశ్వరపురం: కిశోర బాలికలు తమలో జరిగే శారీరక మార్పులను శాస్త్రీయంగా అవగాహన చేసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినం సందర్భంగా మండలంలోని మాచరలో కిశోర బాలికలు, వారి తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎస్.భవాని వివిధ అంశాలను విశదీకరించారు. యుక్త వయస్సులో శరీరంలోని హార్మోన్ల మార్పుల క్రమాన్ని వివరించారు. సామాజిక అవగాహన లోపాల కారణంగా రుతుక్రమ ప్రక్రియను సిగ్గుపడే అంశంగా కొందరికి అలవాటైందన్నారు. కొందరు కిశోర బాలికలు ఆ సమయంలో ఒంటరిగా ఉండడం, అన్నీ తమకు తెలుసున్నట్టు వ్యవహరించడం చేస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌తో కౌన్సిల్ ప్రజాప్రతినిధుల భేటీ



వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి, విప్ పోతంశెట్టి



అధినేతతో కరచాలనం చేస్తున్న కర్రి పాపారాయుడు. చిత్రంలో త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపాలిటీ, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన సమావేశానికి మున్సిపల్ కౌన్సిల్ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. హాజరైన వారిలో మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కౌన్సిల్ పార్టీ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు మారిశెట్టి సత్యనారాయణ, మందపల్లి రవి, యర్రగుంట లక్ష్మీసౌజన్య, పిల్లి శ్రీనివాస్, మెండి భవాని, నీలం దుర్గ, మెండు బాపిరాజు, శెట్టి కల్యాణి, ఎర్నేని ప్రభావతి, కౌన్సిల్ కో–ఆప్షన్ సభ్యురాలు శాంతకుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, నాయకులు పెంకే గంగాధర్, కనికెళ్ల పల్లవీప్రసాద్, పతివాడ రమణ, కొమ్ము రాంబాబు, యరమాటి వెంకన్నబాబు, షేక్ గౌస్, రబ్బాని, అయ్యప్ప ఉన్నారు.

ఉపాధి బకాయిలను వెంటనే చెల్లించాలి



శీలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

కాజులూరు: గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తణుకువాడ, శలపాక, మంజేరు, శీల తదితర గ్రామాల్లో కార్మికసంఘం నాయకులు పర్యటించి ఉపాధి వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శీలలో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో భాగంగా వేతనాలు కనీసం 15 రోజులకు ఒకసారైనా చెల్లించాల్సి ఉందని ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఎక్కడ అది అమలు జరగడం లేదన్నారు. పనులు చేసి ఆరు వారాలు గడుస్తున్న వేతనాలు ఇవ్వకపోతే కూలీలు ఏమి తిని బతుకుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకటో తేదీ నాటికి ప్రతీ ఒక్కరికి వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో సంఘం ద్వారా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.కృష్ణ, ఎం.చల్లారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న కార్మికులను ప్రభుత్వం విస్మరించడం విచారకరమన్నారు. తొలిదశ ఆందోళనలో భాగంగా సమ్మెకు దిగామని, డిమాండ్లను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించామన్నారు. రోజులు గడుస్తున్నా తమ డిమాండ్లను పరిష్కరించకపోవడంతో మలివిడత ఆందోళనకు దిగామన్నారు. ఇప్పటికైనా తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసంశెట్టి వాసు, గన్నియ్య, కప్పల అన్నవరం, గంటి నవీన్‌కుమార్, కప్పల సురేంద్ర, తలాటి వెంకన్న, పిట్టా ప్రవీణ్‌కుమార్, ఖండవిల్లి రాజు, మత్తాల రమేష్ పాల్గొన్నారు.

పంటకాలువలు బాగు చేయాలి



మొగలిపాలెంలో పూడిక పెరిగిపోయి మెరకగా మారిన పంటకాలువ

కాజులూరు: వరి పొలాలకు సాగునీరు అందించే పంటకాలువల్లో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. మరో వారం రోజుల్లో గోదావరి నుంచి డెల్టాకు కాలువనీరు విడుదల కానుండటంతో తొలకరి సాగు పనులకు రైతులు సన్నద్ధమౌతున్నారు. అయితే పంటకాలువల్లో పూడికలు పెరిగిపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడతాయని మండల గ్రామాలకు చెందిన పలువురు రైతులు వాపోతున్నారు. గతంలో ఖరీఫ్, రబీ సాగు ప్రారంభానికి ముందే ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు ప్రధాన కాలువలు, పంట కాలువల తవ్వకం పనులు నిర్వహించేవారు. ఇటీవల ఉపాధిహామీ పథకం ద్వారా కాలువ పనులు జరగడం లేదని దీంతో పూడికలు పెరిగిపోయి పంటకాలువలు మూసుకుపోతున్నాయని ఫలితంగా పొలాలకు సాగునీరందే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువలను తవ్వించి సాగు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు టేకుమూడి సత్యనారాయణ, కర్రి రామరెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితర రైతులు కోరుతున్నారు.

దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి



యోగా ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు



యోగా అభ్యసనలో ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: యోగాను తమ దైనందిన జీవితాల్లో భాగం కావాలని, యోగాచరణతో దేహ దారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ సొంతం చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల అన్నారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం యోగాంధ్ర–2025 భాగంగా యోగ అభ్యసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికీ యోగాను చేరువ చేసేందుకే యోగాంధ్ర కార్యక్రమాలను 26 రోజులు 26 ఇతివృత్తాలతో అమలు చేయడం జరుగుతుందన్నారు. కోట్ల మందికి యోగాను చేరువచేసేందుకు పెద్ద ఎత్తున కృషి జరుగుతుందని, ప్రతిఒక్కరూ తమ జీవితంలో యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. శ్వాసపై ధ్యాసతో తనువు మనసును ఏకం చేసి సునం ఆరోగ్యాన్ని బాటలు వేసే యోగా ఔన్నత్యాన్ని ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికీ చేరువచేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. యోగా ప్రయోజనాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలు తమ జీవనశైలిలో యోగాను భాగం చేసుకొని జీవితాంతం అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. భారతీయ వారసత్వ సంపద అయిన యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ రాజు ట్రైనర్ తొగరు మూర్తి, పట్టణ గాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: యోగా ప్రయోజనాలు అందరికి చేరాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని అందించే ఒక ప్రాచీన వ్యాయామ సాధనం అన్నారు. ఇది మన శరీరానికి అవశ్యత, బలం, సమతుల్యతను ఇస్తుందన్నారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుతుందని, యోగా మన రోగనిరోధక శక్తిని పెంచుతుందని, ఒత్తిడిని తగ్గించడంతో పాటు రక్తపోటును నియంత్రిస్తుందన్నారు. యోగాను ప్రజలు తమ జీవనశైలిగా తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం యోగా అవశ్యకతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడవద్దు



ఎస్సై శాస్త్రి

అయినవిల్లి: వాహనచోదకులు వాహనాలు నడుపుతూ అర్జెంట్ కాల్ రావడంతో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తు ఉంటారని ఇటువంటి చర్యలు వల్ల ఘోర ప్రమాదాలు సంబవించవచ్చని అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. బుధవారం ఎస్సై స్థానిక విలేకరులో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ అవసరమైందన్నారు. ఈ సెల్‌ఫోన్ వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. సెల్‌ఫోన్ అవసరం ఉండవచ్చు కానీ వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌ను ఉపయోగించకూడదన్నారు. దీని వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రయాణ సమయంలో కాల్స్ వస్తే రోడ్డు పక్కన ఎవరికీ ఇబ్బంది లేని స్థలంలో వాహనాలు ఆపి అప్పుడు కాల్స్ మాట్లాడాలన్నారు. అలాగే మైనర్లు, యువత డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారన్నారు. అటువంటి వారిపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. అమ్మాయిలను ఏడిపించే ఆకతాయిలను, దొంగతనాలకు పాల్పడే వారిని, అల్లరి మూకలను చట్టపరంగా వదిలిపెట్టేది లేదన్నారు.

కిశోర బాలికలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



చొప్పెల్లలో ప్రపంచ రుతుక్రమం ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

అలమూరు: కిశోర బాలికలు రుతుక్రమ సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని పరిశుభ్రత పాటించడం ద్వారా వైరస్ సంబంధిత వ్యాధుల నుంచి సంపూర్ణ ఆరోగ్య రక్షణ పొందాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ అన్నారు. ప్రపంచ రుతుక్రమం ఆరోగ్యం–పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. రుతుక్రమ సమయంలో యుక్త వయస్సుకు వచ్చిన కిశోర బాలికలు పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం ఆయా గ్రామాల హెల్త్ క్లినిక్‌ల పరిధిలో కిశోర బాలికలతో కలసి వైద్య ఆరోగ్య సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించి రుతుక్రమంలో బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్ఎ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, హెచ్‌వీలు పి.ఉమ, ఆర్.బాలామణి, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ రోగికి సాయం



కాకినాడ ఆసుపత్రి వద్ద రోగి కుటుంబ సభ్యులకు సాయం చేస్తున్న యూత్

సఖినేటిపల్లి: మండల కేంద్రానికి చెందిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ రోగి అత్తిలి సాయి గాయత్రికి బుధవారం గొంది కనక ముత్యాలమ్మ యూత్, వేర్వేరు ప్రాంతాల దాతలు సంయుక్తంగా సమకూర్చిన నగదు మొత్తం రూ.1,47,509 అందజేశారు. ఈ మేరకు కాకినాడలోని ఒక ఆసుపత్రిలో రోగి గాయత్రికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనంతరం చికిత్స అవసరాలు నిమిత్తం ఆసుపత్రి వద్దకు వెళ్లి వారంతా రోగి కుటుంబ సభ్యులకు పై నగదును అందజేశారు.

అగ్నిబాధితులకు సాయం పంపిణీ

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక సబ్‌స్టేషన్ రోడ్డులోని అగ్నిప్రమాద బాధితురాలు కోళ్ళ వెంకాయమ్మ, మంగాయమ్మలకు బుధవారం సర్పంచ్ ఓగూరి రత్నకుమారి సాయం పంపిణీ చేశారు. కట్టెలు పొయ్యి నుంచి ఎగసిన మంటల వల్ల జరిగిన ప్రమాదంలో బాధితులు సర్వస్వం కోల్పోయారు. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా వచ్చిన రేషన్ బియ్యం 25 కేజీలతో పాటు సొంతంగా కొంత నగదును ఆమె అందజేశారు. ఓగూరి బాబులు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.